ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెట్ల పొదల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనా కథనానికి అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ లైన్‌మన్ రాంచంద్రయ్య, జూనియర్ లైన్‌మన్ మహేందర్ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సందర్శించారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్ల పొదలను, విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన తీగలను పూర్తిగా తొలగించారు. మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను ఎత్తు పెంచేందుకు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని వారు కోరారు.


అబ్దుల్లాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్ల పొదలను తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది


శ్మశానవాటికలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తా

మన్సూరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో గల హిందూ శ్మశానవాటికలో రూ.50.50లక్షల వ్యయంతో చేపట్టిన అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ దహన సంస్కారాల నిమిత్తం వచ్చే ప్రజలకు ఆర్థిక భారం మోపకుండా రూ.18వేల నుంచి రూ.20వేల లోపు మాత్రమే తీసుకోవాలని సూచించారు. శ్మశానవాటికలో జరుగుతున్న చోరీలను దృష్టిలో ఉంచుకుని పరిసర కాలనీలు ఓ కమిటీగా ఏర్పడి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మొరిశెట్టి సంతోష్‌కుమార్, పాతూరి శ్రీధర్‌గౌడ్, వివిధ కాలనీ అసోసియేషన్ల సభ్యులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా నిర్మాణాలు చేపట్టొద్దు

ఎల్బీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజీగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గ్లోబల్‌రోడ్డు వైపునకు వెళ్లే మార్గంలో సమతాకాలనీ మూలమలుపు వద్ద రాకపోకలకు ఇబ్బందికలిగేలా ఉన్న ఓ ఇంటి ముందు నిర్మించిన గ్రానైట్ బేస్మెంట్‌ను సంబంధిత అధికారులు, సిబ్బందిచే బుధవారం తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, జీహెచ్ఎంసీ, హైడ్రా విభాగం సిబ్బంది ఉన్నారు.


బేస్మెంట్ తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

బస్సు సేవలు పునఃప్రారంభం

ఎల్బీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరోనా నుంచి నిలిపివేయబడిన బస్సు సేవలను తిరిగి ప్రారంభించడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్కేపురం డివిజన్ గుండా ఆర్టీసీ బస్సుల సేవలను చిలుకా ఉపేందర్‌రెడ్డి, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమంత పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి చొరవతో నేడు బస్సుల సేవలు తిరిగి ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రమేష్ నేత, ఖిల్లా సైదులు, శేఖర్ ముదిరాజ్, మహేందర్, మహమ్మద్, లింగస్వామి గౌడ్, జగిని రమేష్, యాదవరెడ్డి, జెల్లా జగన్నాథం, శ్రీధర్, హరి, శ్రవణ్, సంతోష్, శశియాదవ్, అశోక్, శ్రీనాథ్, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.


బస్సు సేవలను పునఃప్రారంభిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమంత, చిలుకా ఉపేందర్‌రెడ్డి

● అభినందనలు



హరియాణాలో గత నెల 20 నుంచి 24 వరకు జరిగిన ఆలిండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ పోటీలో కాంస్య పతకం సాధించిన జట్టుసభ్యుడు రాచకొండ ఐటీ కమ్యునికేషన్ కానిస్టేబుల్ జస్వంత్‌ను బుధవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించిన సీపీ సుధీర్‌బాబు

- హైదరాబాద్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

● సన్మానం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టిన కె.సురేంద్రమోహన్(ఐఏఎస్)ను సచివాలయంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ బుధవారం కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్, సిబ్బంది కొరత సమస్యలను పరిష్కరించాలని కోరారు.

- సైదాబాద్ అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి)

● స్వాగతం



అమెరికా పర్యటన ముగించుకుని బుధవారం నగరానికి విచ్చేసిని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి గ్రేటర్ హైదరాబాద్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి ఘన స్వాగతం పలికారు.

- హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్


మద్యం ప్రియులకు కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి

కొత్తపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు సూచించారు. బుధవారం వారు ఉప్పల్, రామంతాపూర్, చిలుకానగర్, నాచారం, పీర్జాదిగూడ కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన 19 అవగాహన కార్యక్రమాల్లో 637మందికి అవగాహన కల్పించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలనూ వివరించి వాహనదారులకు కరపత్రాలు పంపిణీ చేశామని వారు తెలిపారు.

148 మంది మందుబాబులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడిపితే శారీరకంగా, మానసికంగా తీవ్ర నష్టాలు జరుగుతుందని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో పట్టుబడిన వారిలో 148మందికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో బుధవారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో 6 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించడం కోసం సందేశాత్మక గీతాలు, మద్యంమత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ ప్రదర్శించారు.

పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కులో..

వనస్థలిపురం జెడ్పీహెచ్ఎస్ నుంచి 40 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును బుధవారం సందర్శించారని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెలిపారు. ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రైనర్ ప్రవీణ్ పార్కు ట్రాఫిక్ నిబంధనల సైనేజీ బోర్డులపై ఉన్న నిబంధనల ప్రాధాన్యత, రహదారుల పక్కన ఉండే సూచికలనూ వివరించారు. నిబంధనలు పరిచయం చేసే రైమ్స్, యానిమేషన్ చిత్రాలనూ లెక్చర్ హాల్‌లో ప్రదర్శించారు. వాహనాలు నడిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలను పాటిస్తూ పార్కులో విద్యార్థులు సైకిళ్లు తొక్కారు. రంగుల బొమ్మలతో రూల్స్ పరిచయం చేసే ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్‌ను పిల్లలకు అందజేశారు.

సింధూర్ ఎన్‌క్లేవ్‌లో సమస్యలు పరిష్కరిస్తా

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుయాష్కీగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్, చిత్రంలో మల్‌రెడ్డి రాంరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి తదితరులు

మన్సూరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సింధూర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుయాష్కీ గౌడ్ హామీ ఇచ్చారు. సింధూర్ ఎన్‌క్లేవ్‌కాలనీలోని యువేరా అపార్ట్‌మెంట్ వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి మధుయాష్కీగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్య, ప్రైవేటు వ్యక్తుల వాహనాల పార్కింగ్, పార్కు అభివృద్ధి, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించాలని అపార్టువాసులు వారిని కోరారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి విజయవాడ జాతీయ రహదారి నుంచి సింధూర్ ఎన్‌క్లేవ్‌లోకి నేరుగా రోడ్డు అనుసంధానం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పోలీసులతో మాట్లాడి ప్రైవేటు వ్యక్తుల వాహనాల పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ సమస్య నివారణకు చొరవచూపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, అపార్ట్‌మెంట్ వాసులు నర్సిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి మహిళలు వెన్నెముక



మహిళా సాధికారతపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, హహిళా అధికారులు

రాజేంద్రనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి మహిళలు వెన్నెముక లాంటివారని, వీరి పాత్ర చాలా గొప్పదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.సాగర్ హనుమాన్ సింగ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో బుధవారం మహిళా కిసాన్ దివస్‌ను నిర్వహించారు. సంపన్న దేశం కోసం మహిళా రైతును సాధికారపరచడం అనే ఇతి వృత్తంతో మేనేజ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి 80 మంది మహిళా పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రోజువారీ వ్యవసాయ కార్యకలాపాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్ వరకు అన్ని దశలలో చురుకుగా మహిళా రైతులు, మహిళా పారిశ్రామిక వేత్తలు పనిచేస్తున్నారన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలు, రైతులు నమ్మకంగా ముందుకు సాగాలన్నారు. కాన్ఫడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షురాలు, జాతీయ జాయింట్ సెక్రటరీ చేతనాజైన్ మాట్లాడుతూ మహిళల నేతృత్వంలోని సంస్థలను బలోపేతం చేయడానికి వ్యాపార ఉత్పత్తులను ప్రదర్శించడం, సహకారాన్ని పెంపొందించడం వంటి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మహిళా రైతులు, పారిశ్రామిక వేత్తలు మారుతున్న సమాజానికి అనుగుణంగా మారాలన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు భవ్యత బెన్, ఉజ్వల గణేశ్ రౌత్, డాక్టర్ విణీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ శారదనగర్, గణేష్‌నగర్, గ్రీన్ హిల్స్ లక్ష్మీనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈ తెలిపారు. 11కేవీ శారదనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల, గణేష్‌నగర్, గ్రీన్ హిల్స్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు.. డ్రైవర్‌కు గాయాలు

చంపాపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సిగ్నల్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటోను కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఫిసల్‌బండ నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళుతున్న గ్రాండ్ విటారా కారు (టీఎస్ 07 జేవై 9099) కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏఎస్ఎల్ సిగ్నల్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఆటో(టీఎస్13 యూసీ 4991)ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పల్టీ కొట్టడంతో హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ యూసుఫ్(39)కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. యూసుఫ్ అన్న తాహేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

హైటెక్ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తిని ఆటో ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మాదాపూర్ ఎస్ఐ బాల్‌రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఈ నెల 13న తాడి కాంపౌండ్ సిగ్నల్ నుంచి పర్వత్‌నగర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో అతడిని ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ బాల్ రామ్ తెలిపారు. అతడి కుడిచేతిపై హిందీలో మహదేవ్ అనే అక్షరాలు ఉన్నాయని, వివరాలు తెలిసిన వారు మాదాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ధార్మిక పరిషత్ బోర్డును ఏర్పాటు చేయాలి

● గంగు ఉపేందర్‌శర్మ

పంజాగుట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిందూ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు, ఉద్యోగులకు భద్రత కల్పించాలని తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ధార్మిక పరిషత్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని శ్రీ రామాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ అర్చక సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బి.రామశర్మ, అర్చకులతో కలిసి ఆయన మాట్లాడారు. దేవాదాయ శాఖలో వేలాదిమంది అర్చకులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని ఈ క్రమంలో కొంతమంది ఈర్ష్యాద్వేషాలతో హిందూ సమాజాన్ని కలుషితం చేయాలని, ఆలయల పరిపాలనలో జోక్యం చేసుకోవాలనే ఉద్దేశంతో కార్యనిర్వహణాధికారి, ఉద్యోగులు, అర్చకులపై లేనిపోని అబాండాలు వేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు పోలీసు కేసులు పెట్టి వాటి ద్వారా లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వెంగళరావునగర్ శ్రీ రామాంజనేయ స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న అర్చకుడిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టడం అన్యాయం అని అన్నారు. ఈ సమావేశంలో అర్చకులు వెంకటరత్నం, అంబా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భార్యతో వాగ్వాదం.. భర్త ఆత్మహత్య

నార్సింగ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎంటీ రాములు(52) తన భార్య ఉమారాణితో కలిసి రాందేవ్‌గూడలో నివాసం ఉంటున్నాడు. రాములు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. అప్పుల బాధ తాళలేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ నెల 14న తన భార్యతో వాగ్వాదం జరిగింది. రాములు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బుధవారం రాములు మంచిరేవుల గ్రామంలోని గోపాలస్వామి ఆలయ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వారు చేరుకొని మృతుడి వివరాలు తెలుసుకొని, అతడి భార్య ఉమారాణికి సమాచారం అందించారు. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

● ఐదుగురి అరెస్టు, 1,350 గ్రాముల సరుకు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్ డబ్బాలు

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ, ఒడిశా బార్డర్ నుంచి హాష్ ఆయిల్‌ను గుట్టుగా రవాణా చేసి నగరంలో విక్రయిస్తున్న ముఠా ఆటకట్టించారు ఈస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. మొత్తం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు స్మగ్లర్స్ కాగా.. ముగ్గురు వినియోగదారులు. వారి నుంచి 1,350 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లాకు చెదిన కేతబోయిన సంజయ్‌కుమార్, కర్నూలుకు చెందిన అబ్బ నాగన్న బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి పెయింటింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. స్నేహితుల ద్వారా గంజాయి, హాష్ ఆయిల్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో దాన్నే అలవాటుగా మార్చుకొని అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఏపీ, ఒడిశా నుంచి గంజాయి తైలం (హాషిష్ ఆయిల్) ఎక్కువ మొత్తంలో తెప్పించి నగరంలోని కస్టమర్స్‌కు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈస్టు జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. బుధవారం గౌలిగూడ పరిధిలోని సీబీఎస్ బస్‌స్టేషన్ సమీపంలో వినియోగదారులకు హాష్ ఆయిల్‌ను అందజేస్తున్నట్టు తెలుసుకొని అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి దాడి చేశారు. ఇద్దరు స్మగ్లర్స్‌తో పాటు.. మరో ముగ్గురు వినియోగదారులు మహేష్, ఇర్ఫాన్, లోకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 7లక్షల విలువైన 1,350 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిన్న డబ్బాలతో నింపిన హాష్ ఆయిల్‌ను ఒక్క గ్రాము రూ. 500 చొప్పున విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది.


తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ సభలో ప్రతినిధులు

ముగిసిన టీఎండబ్ల్యూఈయూ మహాసభలు

హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలో జరుగుతున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ (టీఎండబ్ల్యూఈయూ) 5వ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకురాలు దుర్గమ్మ జెండా విష్కరణ చేశారు. అనంతరం అమరవీరులకు నివాళ్లు అర్పించారు. యూనియన్ గత మూడు సంవత్సరాలుగా చేసిన ఉద్యమాలు, పోరాటాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు శాశ్వత కనీస వేతనం రూ. 26 వేలకు పెంచేందుకు పోరాటం చేయాలని, మరణించిన కార్మికులకు రూ. 20 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో కార్మికులకు తొలి ప్రాధాన్యమివ్వాలని, కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు లేదా డబల్ బెడ్‌రూం ఇవ్వాలని, సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబంలో మరో వ్యక్తికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, లేబర్ కోడ్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలని తీర్మానం చేశారు.

టీఎండబ్ల్యూఈయూ రాష్ట్ర అధ్యక్షుడిగా పాలడుగు భాస్కర్

ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జనగాం రాజమల్లు, వర్కింగ్ ప్రసిడెంటుగా సుధాకర్, కోశాధికారిగా అశోక్‌తో పాటు 29 మందిని ఆఫీస్ బేరర్లుగా 130 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ బంద్‌కు సీపీఎం మద్దతు : నర్సిరెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న బీసీ జేఏసీ నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు సీపీఎం మద్దతు ఉంటుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సిరెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లును కేంద్రమే అడ్డుకుంటుందని అన్నారు. కేంద్రం ఆర్డినెన్స్ తీసుకువచ్చి బిల్లు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, సభ్యులు వీరయ్య, నరహరి, సత్యనారాయణ, నర్సిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


డీసీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఎస్సీ బస్తీ సమస్యలు పరిష్కరించండి

మన్సూరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీఎన్ రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ అజ్మీయగూడలోని ఎస్సీ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బండారి రవికుమార్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు బీఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో బుధవారం జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ ముదిరాజ్, సంపత్ మాట్లాడుతూ ఓపెన్ నాలా, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో 25ఏళ్లుగా ఎస్సీ బస్తీలోని రోడ్లు మురికికూపంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. దోమలు వ్యాప్తిచెంది స్థానికులు అనారోగ్యం బారినపడుతున్నారని వివరించారు. వెంటనే చొరవ చూపి ఎస్సీ బస్తీలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు గువ్వల సాయి, రామకృష్ణ ముదిరాజ్, మంత్రి జగన్, ములకలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ యాదవ్, గణేష్ యాదవ్

20న యాదవ సదర్ సమ్మేళనం

మన్సూరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యాదవ సదర్ సమ్మేళనాన్ని మన్సూరాబాద్ చౌరస్తాలో ఈ నెల 20న నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, అఖిల భారత యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మాజీ ఉపాధ్యక్షుడు పోచబోయిన గణేష్‌యాదవ్ తెలిపారు. బుధవారం మన్సూరాబాద్‌లోని ఈశ్వరమ్మ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మన్సూరాబాద్ చౌరస్తాలో నిర్వహించే యాదవ సదర్ సమ్మేళనంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని యాదవులు, ఇతర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పోచబోయిన కృష్ణయాదవ్, బొల్లు యాదయ్య యాదవ్, కె.జగదీష్‌యాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్, పోచబోయిన శ్రీకాంత్ యాదవ్, కేశవబోయిన రవి యాదవ్, ఖరాడి చిట్టియాదవ్, పోచబోయిన నాగేశ్ యాదవ్, వినోద్‌యాదవ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయండి

● తెలంగాణ సదర్ ఉత్సవ సమితి

సైదాబాద్ అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన విధంగా సదర్ ఉత్సవాలకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షైల్‌కోల్ మహేందర్ యాదవ్ బుధవారం సచివాలయంలోని సీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నిధులు కేటాయింపుపై ఇప్పటికే ప్రభుత్వం జీఓ జారీ చేసిందని తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీశైలం యాదవ్, మాణిక్ యాదవ్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో పారుతున్న మురుగు

రోడ్డుపై మురుగు పరుగు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ జేసీబీ షోరూం సమీపంలో విజయవాడ జాతీయ రహదారి-65 సర్వీసు రోడ్డులో దాదాపు నెల రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగి రోడ్డుపై ఏరులా పారుతోంది. మురుగు నిలిచిన చోట రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా జాతీయ రహదారి, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.